# వలస

తొలికోడి కూసింది.

వెన్నెల వెల్లిపోయింది. మలికోడి కూసింది. పల్లె లేచింది. కళ్ళు తెరిచిన ప్రతి ఇంటి ముందర పల్లె పడుచులు ఊడ్చి కల్లాపి చల్లి ముగ్గులు పెట్టారు. ఇంటి పనులు చూడను లోనికి వెళ్లారు.

పల్లయ్య మోకాళ్లపై మోచేతులను ఆనించి ముంజేతులతో ముఖాన్ని పట్టుకుని ఆకాశం కేసి ఆందోళనతో చూస్తున్నాడు.

కోయిల రావి చిగుళ్లను చూసిన సంబరాన్నో... అమ్మనుకున్న కాకి తను కూయగానే తరిమిందనే ఆవేదన తోనో మరి రావిచెట్టు మీద నుంచి రాగాలాపన చేస్తోంది.

ఆలకించిన పల్లయ్య ఆకాశం వైపున్న చూపును రావి చెట్టువైపుకు మళ్లించి "ఒలే కోయిలా! నీవు కూస్తున్నావని సెప్పి కొండ ఉరుముతుందేటి? ఉరమదుగాక... ఉరమదు. ఎలిసున్న ఆకాశం నీలి మబ్బుల రానీదు. ఏరువాకకు ముందే ఏరొచ్చేసిందని ఉబ్బుతూ వాగలికడతారు పల్లపూళ్లవాళ్లు. మాం మబ్బుల్ని, చినుకుల్ని నమ్మినోళ్లం. రోహినీకార్తెలో రోళ్లు పగలే ఎండకాసినా... ముగసిరకార్తెను ముసురట్టుకున్నా మబ్బులేసి సన్న జల్లులతో భూదేవిని చల్లబరిసేది. గాలి వాటానికొచ్చిన మబ్బు... చిటు కనక, పాటు కనక... గాల్లోనే తేలిపోనాది. 'ఉరిమే మేఘం గల్తే' కురవదురా కొడకా!" అయ్యన్న మాట నిజం చేసింది.

తరువాత కార్తె రానే వచ్చింది. తొలకరి చినుకులకు ఎగిసే నేలతల్లి కమ్మని వాసన కరువైపోనాది. నా మేని చెమట చినుకులు రాల్తుంటే... ఆరుద్ర పురుగులు నాగేటి చాళ్లను కదులుతుంటే... ఇంటాదది తెచ్చిన చద్ది మూట ఇప్పకుండా ఆటిని ఒకటో కటిగా ఏరి పూవులుగ కొప్పనెట్టిన సంబరం తలుచుకుంటే... కూకున్న నాను కూలిపోతానేమో... ననిపిత్తుంటే... కోయిలా?

ఏ కార్తెను గూర్చి నానేటి సెప్పేది! కార్తెలు ధర్మం కాలరాశాయని సొప్పనా? న్యాయంగానూ... నాలుక్కాళ్లనూ నదుత్తున్నాయని సెప్పనా...? పునరస్, పుష్యాలొచ్చాయి. పూరేడుపిట్ట ముడ్డి కూడా తడవని చినుకులడిపోనాయి. నా మడిసెక్క తడి సేదుత్తదేటి?

కిందటేడు గల్తే- "పుబ్బరేగినా... బూతురేగినా... ఆగదురా" అన్నాడు మాఅయ్య. అనుభవాన అయ్య సెప్పాడనుకున్నాను. అటక మీదున్న ఇత్తనాల దింపి ఆనందంగ చల్లాను. పుబ్బను పుట్టిన మొలక గల్తే మగ్గలొ మాడూరుకుంది. అయ్య మాట అబద్ధమైపోనాది. మా తాతనాడు గల్తే చేటంత మబ్బేత్తే... చెరువంత వాన కురిసేదని సెప్పితే ఇనుకున్నాను. ఇప్పుడు గల్తే ఈ ఆకాశం చారెడు మబ్బు తునకను చారనీయదు.

నా మావ- అదే నా పెళ్లం అయ్యా "ఉత్తర మాసి ఎత్తర గంపా!" అన్నాడు. ఆరుగాలం ఋతువుల గుణాన్ని అర్థం చేసుకున్న ఆయన మాట నిజమని నమ్మి గుత్తేరు శనగిత్తులా, జొన్నిత్తులా మడిసెక్కను మదుపెట్టాను. చిత్తగల్తే చిత్తగిస్తదనీ, స్వాతిగల్తే చల్లగా చూస్తదనీ, ఇశాఖకార్తె కరుణించి ఒక ఇసురు ఇసరదా? ఎకరాకి పుట్టెడు రాలకుంటాయా... అని. కాళీ గంపను చూస్తూ కాసంత సంతోషంతో అనుకున్నాను.

నీతీ నిజం మదుసుల్లోనే మాయం అయిపోనాయనీ, మాం ఎలికి తీయలేమనీ వచ్చిన కార్తెలు ఒప్పేసుకుని ఎల్లిపోనాయి. వొరుపు చూత్తూ మొలక ఏపు గొత్తదేటి? వొరుపే... వొరుపు నల్ల మబ్బుల ఆకాశం రానీయని వొరుపు. చినుకు రాలని వొరుపు.

ఉగాది నాడు వేప పూత పచ్చడెట్టొచ్చిన బాపనయ్య గల్తే " పల్లయ్యా ఈ సంవత్సరం వర్షపాతం ఎక్కువే అన్నాడు. రైతులు భయపడవక్కరలేద" న్నాడు. ఆయన మాట కూడా అబద్దం చేసి ఈ ఆకాశం మామీన అలిగి కూకుంది. మెట్ట పొలము న్నోళ్లే ఎదవను చేసింది. ఎన్నని సెప్పేది. ఎన్నని సెప్పేది? నీ రాగమిన్న దీని గుండె ఇప్పుడు కరుగుతుందేటి? కరగదుగాక కరగదు.

చెరువు కింద మాగాణీ చేలు కోత కొచ్చినాయి. చేను రైతు పాలేల్లు గల్తే ఆళ్ల చేనే కోత కొచ్చేసినట్టు మురిసిపోతూ... మా వంక చూత్తూ "పాపకర్ముని చేను ఏమి పండింది పల్లేరు పండింది. పదలమైనాది. మరాజుల చేను ఏం పండింది. రాజనాల్ పండింది. రాసులిత్తుంది!" పాటంటే మాకెట్టాగుంటాది? చెడ్డ రోసం వస్తాదా... రాదా... సొప్పు. "నాయాల ఎవుదురా పాపం చేసింది. నీవు చేశావు. నీ ఆసామి చేసినాడు. గంపెడు పాపాలు చేసినారు. గాదికింది పందికొక్కుల్లా బలిసినారు. బక్కోళ్లనిగల్తే మాటల ఈటలతో బాధించేత్తున్నారా!" అంటూ కర్ర తిప్ప మాశాను. కాలం కలిసిరానోళ్ని గదా? కన్నీరొచ్చి ఊరుకున్నాను.

ఆ సాయంత్రం గల్తే పంచాయితీ రేడియో అరిసింది. ఏటని అడగవే? నీవడగనేవు. నానే సెపుతా వినుకో. ఆ అరుపూ ఊసుపోని మాపల్లె ఊకొట్టేసినాది. చెట్లు కూలే గాలి ఏత్తదనీ, చెరువులు పొర్లే వర్షం కురుస్తదనీ... చేప లట్టను నీటి మీనికి ఎల్లొద్దనీ. మాకు నీరే కరువుగదా? చేపలట్ట బోతామా? నవ్వుకున్నాను... పని లేక అనే మాటనుకున్నానూ... బాపనాయనకే సమంగా తెలిసేడవదుగదా? బుర్లి పెట్టెకేటి తెలుసని ఊరుకున్నాను.

ఆ రాత్రి మా పొట్లు ఆ భగవంతుడు మాశాడు. మా ఏడుపు నేలతల్లింది. పెట్టి సెప్పినట్టే పెళ పెళా చెట్లేరిగినాయి. కమ్మలిల్ల కప్పు లెగిరిపోనాయి. కుండ పోత వర్షం కురిసినాది. పిల్లా పాపలతో ఆ నీట్లో గల్తే అల్లాడినాం. తెల్లారి నంక వానా... గాలీ జోరు తగ్గినంక మడిసెక్క దగ్గర కెల్లి చూద్దును గందా? మాట



# కొండపల్లి కోటేశ్వరమ్మ

రాకుండా పోనాది. ఎండకు మాడి వానలేక మిగిలిన జొన్న కర్రలు గల్లే నేలకూలినాయి. నీళ్లందు నాని పోనాయి కోత కొచ్చిన పున్నాత్ముల వరిచేన్లు గల్లే నీటితో నిండిపోనాయి. కంకులు కనిపించలేదు. మరు రోజుకు నీరు లాగేసినా... తడిసిన ధాన్యం ధరపలక దని తలపట్టుకునేద్వారా పున్నాత్ములు. నాలు కుంచాలు జొన్నలు రాల్తాయనుకుంటే నేలకూలి నాయనీ నీట నానిపోనాయనీ మాం ఏడ్చినాం.

పల్లపు చేనున్న పెద్ద రైతులు పలుకుబడితో దాలనా... సారవాలంటూ రెండో పంట పండిం చనూ... ఆర్డర్లు తెచ్చేసినారు. మేం భూముండి కూడా ఆరికి కూలీలమైనాం. ఆరి పనులూగ్గిటా చేసినాం. కరువులో వరగబెట్టినట్టుగా తిండికి తూమెదుగింజలిచ్చి... కోతల్లో మాకొచ్చే కూలి గింజలను గల్లే బస్తా తీసుకోని... బాకీ తీర్మానమైనా దన్నారు. కూలీ సమంగా రాక, చిట్టడవి కట్టె గొట్టమనీ, పట్నంగ్గిటా పట్టుకెళ్లి అమ్మను పర్మీషన్లు లేక విరుడంత మట్టి గరిపి ఏడ్చాం.

ఈ ఏడూ... వాన కార్తెలు వొరుపు గానే ప్లెడుతున్నాయి. అడప, దడపా చినుకడి చేనూకును కుతూ... కంకేసినా... కోతల ముందూ... వాయు గుండం రాదని నమ్మకమేటి? ఈ గడ్డెను తాతల, తండ్రుల నుంచి మాం నమ్ముకున్నాం కుటుంబాలు ఎదిగినాయి. కొండ ఎదగలేదు సరిగదా? తరిగి పోనాది. పున్న చెక్క పుదంతం ఇది. నీవు ఈ రాయి చెట్టుమీన చిగురగపడకుంటే... మరో చెట్టుమీనికెళ్లి ఆకలి తీర్చుకుంతావ్. మాకలాంటి దారి కానొస్తదా? కానరాదు. మరిగల్లే... అర్థాకలితో ఈ గెడ్డమీన ఆరుగాలం బతుకీడ్చగలమా?'' అంటూ చెట్టును చూస్తున్న పల్లయ్యను కోళ్ల అరుపులివి గెద్ద తన్నుతుం దనుకుని బైట కొచ్చిన సూరమ్మ చూసింది.

'పొద్దు బారెడెక్కి దాటినా చద్ది తినను రాలే దటనుకుంటున్నాను... మడిసెక్క దున్నను మనసు రాక కోయిల పాట ఇంటూ కూకుండిపోనావేటి? లేచిరా!'' అంది.

''తేమలేని నేల తెగదని చూత్తున్నానే!'' భార్యా వైపు చూస్తూ అన్నాడు పల్లయ్య.

''కోయిల కూతకూ కొండ ఉరుముతుందీ, పిల్ల లల్లి బిల్లి తిరగనూ జల్లు పడుతుందిగానీ... మానదు. చద్ది తాగి చేను మాడ నెల్తువ్‌లే'' అంది. భార్యా.

చేతులూ- కాళ్లూ కదుక్కుని వచ్చి పీట మీద కూర్చున్న పల్లయ్య.

''కట్టపడినా... ఇక్కడ మెట్ట పండదని తెల్సినాది గదా? కట్టం చేద్దామన్నా... పని దొరకదు గదా? పస్తులతో ఎన్నాళ్లీ పల్లెలో భతుకీడ్చగలం. పట్నం పోదాం'' అన్నాడు పల్లయ్య.

''పుట్టి పెరిగిన గెడ్డనొగ్గేసీ, కట్టుకున్న గూడు నొగ్గేసీ పట్నం పోతావా? నయం... రంగమెడతానన లేదు. నీకు పిచ్చిగాని పట్టనేదు కదా?'' సూరమ్మ గట్టిగా అంది.

''నీయవ్వ రంకెలేత్తున్నావేటి? నింపాదిగ సెప్పు'' న్నాడు పల్లయ్య.

''నీవా... నేనా రెంకెలెట్టేదీ... ముగసిర మాశావ్ ముసిలెద్దులా రంకెడుతున్నావ్''. చిరు నవ్వుతో అంటూ చద్ది తినమంది సూరమ్మ.

చద్ది తిని చుట్ట సవరించుకుంటున్న పల్లయ్యను చూస్తూ ''భూమి వున్నాళ్లకు గవర్నమెంటు ఆప్పెడు తుందటగదా? సత్తిబాబు నొద్దకెళ్లి ఆదేటో నాను అడిగొత్తాను. అంతదనక శాంతం గుండ''ంది సూరమ్మ.

చుట్ట నోట్లో పెట్టబోయిన పల్లయ్య ఆగిపోయి.

''ఆ ఎకరాకి వెయ్యిత్తామని సెప్పి... ఏలద్దినంక గల్లే ఏడొందలేవత్తాయంటారంట. రాసి నాయనా ఆ మతలబులన్నీ చూసినాయనాగల్లే రొండొందలు మా కట్నానికని సెప్పి ఐదొందలే మన చేతికిస్తారంట. అయ్యేట్టుకొచ్చేసి ఎరువూ, ఇత్తనాలు కొనేసి చేలో చల్లేత్తామనుకో... వాయుగుండం పడదనీ, వానలొచ్చే త్తాయనీ నమ్మకమేడిసిందేటి? ఆ అప్పు తీరుమానం అయ్యేదారేటి? చెక్క గవర్నమెంటు కొగ్గేసి చేతులు నెత్తినెట్టుకోని అప్పుడైనా నలపెల్లాల్పిందేగదా? మంచి సలా ఇచ్చారు మా రాజులెవరో''నిక్కన్నాడు. చిన్నగ నవ్వాడు. మరొక మాట సెపుతా ఇనుకోమన్నాడు పల్లయ్య.

''గోదారి తల్లికీ గవర్నమెంట్ ఆనకట్ట కట్టేత్త దట. అప్పుడగల్లే మన మడిసెక్క మాగాణి భూమై పద్దు గిట్టా వానొచ్చినా- రాకున్నా పండేత్తదట. బక్క రైతు బాధ తీరిపోద్దంట. అంతదనకు. అంటే రెండు మూడు సంవత్సరాలు పట్నంలో పని చేత్తూ బతుకీడ్చేత్తే మడిసెక్క దక్కుతుంది గదా?'' అన్నాడు.

''నువ్వు మారుసెప్పు నానిగెడ్డ నొగ్గేది లేదు. నీరు పల్లాన్ని చూత్తుంది గాని, కట్టగట్టారనేసి భయం పడి గట్టు ఎక్కుతుందేటి? 'ఈసలా... నీ కెవరో సెప్పినదే కదా? నీవూ నానూ గవర్నమెంటు సెప్పగా ఇనలేదు కదా?'' అడిగింది.

వింటున్న పల్లయ్య విసుగుదలగ ముఖం పెట్టి ''ఒలే! ఎవుర్లకే పిచ్చెక్కినాదీ. అసలు, వడ్డీ కలిపి లావైతే... పాత బాకీ తీర్మానం కింద పాడావును కళ్ల నీళ్ల నొగ్గేసినావే. ఒక్కరోజు సమంగా వరికూడుండ దనేసి పెద్దొడంటే- పేమున్నా పెట్టలేకపోయినావ్. ఆడు ఇశాకపట్నం వెళ్లిపోతానంటే... ఏటనలేకపోయి నావ్. ఏడ్చినావ్. చివరకొగ్గేసినావ్. కూతుర్నొగ్గేసి అల్లుడు కురదారోడ్డుకాడ కూలిసేత్తానంటే... తెస చేతనవక ఆడ్నోగ్గేసినావ్. మరిప్పుడు గల్లే మొగుడ్నీ నొగ్గేత్తావుగాని ఊరు నొగ్గనంతావ్. అంతేనా?'' నాను పట్నమెల్లేది నిజం. నాకుట్టి నోళ్ల నాకాడే వుంటారు. నీ ఒక్కదానివీ ఇక్కడే ఈ కమ్మరింటోనే పుట్టిగట్టు కోని... ఊరేగ''మన్నాడు పల్లయ్య.

సూరమ్మ కొంగుతో కండ్లనొత్తుకుంటూ ''కోప గించకు. సత్తిబాబు పెళ్లం మాలక్ష్మితల్లీ మా మంచి తల్లి. మన కష్టాలనుకోని సాయపడతది. తల్లి మా లక్ష్మీ గల్లే కుర్ర నాగన్నలిద్దర్ని గొడ్డకాడెట్టుకుంటది. కూలిపన్లకీ మనల్నే పిలవనంపుతది. ఇంట్లో పాసిపని గ్గిటా వుంటది గందా? నన్నెట్టుకుంటది. నా మాట కాదని సెప్పని తల్లి మా లక్ష్మి తల్లీ. బేగిలొత్తా!' చెప్పి పల్లయ్య మాట ఏమిటో వినకుండా వెళ్లి పోయింది సూరమ్మ.

సూరమ్మ వెళ్లగానే లేచిన పల్లయ్య పాలపొంగు లాగా వస్తున్న వేదన, ఆవేదనల నణుచుకుంటూ ఆ పల్లెలో చల్లని కొండగాల్లో కర్రా బిల్లా ఆడిన చిన్న తనాన్ని గుర్తు చేసుకుంటూ. తొలకరి సుగంధ పరిమ ళాలనందించే మడి చెక్క మధ్య నుంచి కొత్తగ కొన్న



# ఈనాటి అమ్మాయి

''నాయనా వాళ్ళిన్నిసార్లు కబురు చేశారు గద అమ్మాయి కూడా వంక పెట్టలేనిది. ముహూర్తాల పెట్టుకుందాం'' అంది ఆఫీసుకు బయలుదేరిన కొడుకు అమరేంద్రతో మహేశ్వరి.

''వాళ్ళను వేరే సంబంధం చూసుకొమ్మని చెప్పాను లేమ్మా'' అంటున్న కొడుకు వంక ఆశ్చర్యంగా చూస్తూ విషయమేమిటని అడిగింది తల్లి.

తను చూసినంతవరకు ఎన్నో ఫ్యామిలీస్‌లో చూస్తున్న విధంగా కృత్రిమంగా తన ఫ్యామిలీ ఉండకూడదనుకున్న అమర్ తన కాబోయే భార్య గురించి తనకంటూ వున్న ఆలోచనల ఫలితమే ఆ అమ్మాయితో కొంత సంభాషణ

''మిస్ శాంతీ నేను మీకు నచ్చానా?''

''నచ్చారు.''

''నాకు వెనుక ఆస్తిపాస్తులేమీ లేవు. రూ. 2,000 శాలరీ మాత్రమే.''

''నేను కూడా జాబ్ చేస్తున్నాను గనుక తృప్తిగా జీవించగలమని నా ఉద్దేశ్యం.''

''మరీ చిన్నవిషయాలనుకూడా ఎంతో విపరీతంలా చూస్తావంటూ నా ఫ్రెండ్స్ అంటుంటారు. కాని, ప్రతి విషయాన్ని నిష్కర్షగా ముందే చెప్పటం నా స్వభావం.''


''ఓ.కె. యు ఆర్ వెల్‌కం.''

''థ్యాంక్స్ శాంతిగారూ! నేను చెప్పదలచుకొన్న విషయం నా తల్లిదండ్రులు నా వద్దనే వుంటారు ఎప్పుడూ. మీకిష్టమే కదా!''

''.........''

అంతే. అమర్ ఒక నిర్ణయాని కొచ్చాడు.

— పి. జయప్రద



''రిటరైన క్లర్క్ నిన్న జరిగిన వీడ్కోలు సభలో నీతో ఏదో బాధగా అంటున్నారే?''

''అవును ... నిన్న తన పార్టీ వాళ్ళెవరూ రాలేదంట. రిటైరవుతున్న రోజున లంచం పుచ్చుకోకపోతే భవిష్యత్తులో తన మనసు బాధ పడుతుందని చెప్పి నా దగ్గర పది రూపాయిలు లంచం పుచ్చుకున్నాడు''

-పి. విమల

సత్తు కడియాలు కాళ్లకెట్టుకుని, వద్దనం మూట నెత్తినెట్టుకుని పడమరదిక్కునేసిన వరద గుడిని చూస్తూ వయ్యారంగ వచ్చే సూరమ్మను చూస్తూ... సూరీ! దున్నిన సాల్లో నీవు కాలు మోపితే... మన చేనూ - బారెడు కర్ర నెదిగి మూరెడు కంకినేస్తది. అప్పుడు గల్తే నీ కాళ్లకు నాను ఎండి కడియాలే ఎట్టేత్తాను'' సంబంగ అంటూ మూట నందుకున్న వయసు ముచ్చట్లను గుర్తు చేసుకుంటూ... ఇప్పుడు నెరిసిన తలపై పెట్టుకున్న నీరుకావి తల పాగాను చూస్తూ... అలికిన పిన్నటి నేలను చేతితో స్పృజిస్తూ నేలతల్లీ నిన్నొగేయను తప్పదంటూ బావురు మన్నాడు.

మహాలక్ష్మి గడపలో కాలుపెట్టిన సూరమ్మకు కొడుతున్న దెబ్బల శబ్దం, ఆడ కూతురు నిస్సహాయంగ ఏడుస్తున్న శబ్దం వినిపించాయి.

''పిల్లవాడు లేని సమయం చూసి ఒక్క ఆడ మనిషే ఇంట్లో ఎలా వుంటుందని ఆలోచించక నన్నొంటరిదాన్ని చేసి ఇంట్లో డబ్బంతా పట్నంలో ఉంపుడుగత్తెకోసం వాడేశారు. వంటి మీద సరుకులన్నీ వలుచుకున్నారు. అవి చాలక శతమానం గొలుసు కూడా చేత్తో తెంపుతారా? నేను యివ్వను గాక యివ్వను. లాగకండి. నా మెడ ఒరుసుకుని నొప్పెడుతుంది'' శతమానాల గొలుసు చేత్తో పట్టుకుని గిలగిల్లాడుతున్న మహాలక్ష్మినీ... 'మెడ నొప్పెడుతుందా? అయితే వుండు దాన్ని నరికేస్తాను. కత్తి పీటేస్తాను. నీ వంటరితనం, నీ ప్రాణంతో పోతుంది. నా కద్దు తొలగుతుందంటూ కత్తిపీట నెత్తిన సత్యాన్ని. చూసింది. వాళ్ల మధ్యకు గబగబా వెళ్లింది. ''ఆగు'' అని గద్దించింది. సత్యం చేతిలోని కత్తి పీటను లాగేసింది. 'సంపుతావటయ్యా! సీ... సీ... సదువు కున్నోడివి. సిగ్గునేదూ- ఇల్లొదలని ఇల్లాలినీ, ఇంటికొస్తే
అన్నీ అమర్చి పెట్టే ఆడదాయినీ సంపుతావా?'' అంటూ సత్యాన్ని బలంగా వెనక్కి నెట్టింది. ఆ తోపుకు నివ్వెరపోయిన సత్యం గోడకు గొట్టుకున్నాడు. తలకు దెబ్బ తగిలింది. పంచె ఊడింది - ఇదంతా పక్కవాళ్లకు తెలిస్తే పరువు వుండదనుకున్నాడో... హఠాత్తుగవచ్చిన సూరమ్మను చూసి అయోమయంలో పడ్డాడో... ఊడిన పంచెను సవరించుకుంటూ పెరటి వైపుకు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వెళ్లిపోయాడు సత్యం.

సూరమ్మ నట్టుకుని బావురుమంది మహాలక్ష్మి. సూరమ్మ కూడా ఆయమ్మ తల నిమురుతూ కన్నీరెట్టుకుంది. మహాలక్ష్మికి సూరమ్మ ఆదరణ, ఆత్మీయత కొంచం ఊరటనిచ్చాయి. సూరమ్మ ఆయమ్మ తలను గుండెకత్తుకుని... 'ఏడవకండమ్మా ఏడవ కండి!'' అంది. గొప్పింటివారికన్నా పేదవారికే సాహసం, చొరవా వుంటాదనుకుంది ఆ నిమిషంలో మహాలక్ష్మి. ఆ రోజు సూరమ్మ తన దగ్గరే వుంటే బాగుండుననుకుంది. కళ్లు తుడుచుకుంది గాని అడగ లేకపోయింది.

మహాలక్ష్మి కన్నీటిని కొంగుతో తుడుస్తూ... ''అమ్మగోరూ! నీ పెనిమిటికన్నా... నా పెనిమిటి చాలా మంచోడు. ఆడు నన్ను కసిరినా ఆడికి కనికరం జాస్తి... ఆడు గల్తే- ఇంటిలో ఇబ్బందులొచ్చినప్పుడు నా మీన కోపగిస్తాడేకాని కొట్టడంటే కొట్టడు. నీ పెనిమిటో... నిన్ను కొట్టేస్తాడనీ,నీ సరుకులు గుట్టా దొబ్బేస్తాడనీ, చెడబుద్దులున్నాయనీ నాననుకోనేదు. ఎప్పుడూ చూడానేదూ. ఛ... ఛ ఎంత చెడ్డోడూ. గొప్పోరి గుట్టుగుంతారనుకుంతాను. సత్తెంబాబు పెద్ద మడిసనుకోని ఏటేటో అడగొచ్చాను. ఆయన బుద్ది గల్తే అడ్డమైనాది. ఆడదాయి మీద చెయ్యి చేసుకునేటోడూ... మా బక్కోళ్లకు ఏటి చెపుతాడు? ఏటి సెప్పగలడూ... అమ్మా ఆయనగల్తే... ఆడదాని ఓరిమిని ఆసరగా తీసుకోని అడతున్నాడు. కులం తక్కువ సూరి సెప్పినాదనుకోకు. సత్యపమాణంగ అంటున్న మాట. ముందైనా తెలివిగా మసులుకుంటే మంచిదనిపిస్తా వుంది. నానెల్తాను. నా పెనిమిటి నాకై ఎదురుచూత్తా వుంటాడు'' అంది. మెరుపులాగా మహాలక్ష్మి చూస్తూ వుండగానే గడప దాటింది సూరమ్మ.

విసురుగా వెళ్లిన సూరమ్మ త్వరగానూ, శాంతంగానూ, కళొత్తుకుంటూ రావడం చూసిన పల్లయ్య ''ఏటైనాదే!'' అని అడిగాడు.

''ఏటి నేదు. మనం పట్నమెల్లిపోదాం. పెళ్లాం సరుకునకాశపడేసి ఏదించే ఓని పంచ కంటే... పెళ్లాం పిల్లల సుఖం కోసం ఆరాటపడే ఓనితో వల్లకాట్లో నున్నా మంచిదేను. ఆ పట్నం కుళ్లీదుల్లో నీవు రిక్సా తొక్కేద్దువుగాని, నాను నాలుగిండ్లలో పాసీపనీ గిట్టా సేత్తాను. పిల్లలంతావా... ఆల్లకీ ఆకలేసెప్పెత్తది ఏటి సెయ్యాలోను. ఒల్లొంచి ఈళ్లు ఏవి సేత్తారని తెలిసినంక ఓరైనా పనిలో ఎట్టేసు కుంటారు'' మొగునెంక చూస్తూ ''దిగాలడక''ంది సూరమ్మ.

ఆ రాత్రి నిద్రపట్టని పల్లయ్యకు తొలి కోడి కూత వినిపించింది. కూర్చుని కూర్చుని కునుకు తీస్తున్న సూరమ్మను చేత్తో నిమిరాడు. సూరమ్మ లేచి నిద్ర పోతున్న పిల్లలను లేపింది.

ఉన్న శక్తిని కూడదీసుకుని, వున్నింటిని వదలి, కుటుంబాన్ని వెంట బెట్టుకుని నడుస్తున్న పల్లయ్య వెనుకకు తిరిగి ఇంటిని చూస్తూ రావి చెట్టును దాటాడు. రావి చెట్టు దాపునున్న నూకాలు తల్లి రాతి విగ్రహానికి సూరమ్మ ''ఎల్లొత్తాను తల్లీ!'' అని ఏడుస్తూ నమస్కరించింది. రావి చెట్టు మీద కోయిల వారికి వీడ్కోలే చెపుతుందో... వెడుతున్నారనీ బాధను వ్యక్తం చేస్తుందో కూస్తోంది. మరి కోడి కూత వింటూ పల్లె లేస్తోంది. పల్లెను దాటాడు పల్లయ్య.